క్లుప్తంగా

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ముప్పవరపు శోభారాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పేరేచర్ల -4 సచివాలయం పరిధిలో ఒకటి (ఎస్సీ), విశదల గ్రామంలో ఒక (బీసీ) పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై సామాజిక సమస్యలు, స్థానిక సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో, సేవా దృక్పథం కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల 25 నుంచి 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 29న దరఖాస్తుల పరిశీలన, 30న మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యాన గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పోలకంపాడుకు చెందిన వైఎస్సార్ యూత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి ఈదుల మూడి డేవిడ్‌రాజు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేకా వెంకటరామిరెడ్డి, బొండా నరేష్, సైకం శ్రీను, కొప్పనాతి శివనాగేశ్వరరావు, సైకం శివ, మల్లెల రాజశేఖర్, మల్లెల రాజా, వేముల శ్రీను, కొప్పనాతి శంకర్, రాజేష్, గద్దె గోపి, తిరుపతి భరత్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ముగ్గురికి గాయాలు



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ డివైడర్‌ను కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం నుంచి గుంటూరుకు వస్తున్న కారు ప్రమాదవశాత్తూ ఫిరంగిపురంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొంది. కారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. వారిని 108 వాహనంలో గుంటూరుకు చికిత్స కోసం స్థానికులు తరలించారు. పూర్తివివరాలు తెలియాల్సిఉంది.

సాంబశివరావుకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: సోషియాలజీ విభాగ పరిశోధకుడు టి. సాంబశివరావుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి తెలిపారు. ఆయన సోషియాలజీ విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య వి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ' లివింగ్ కండిషన్స్ అండ్ లైవ్లీ హుడ్ పాట్రన్స్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ (ఏ స్టడీ ఇన్ కృష్ణా డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

వివాహితకు వేధింపులు, భర్తపై దాడి..మూడేళ్ల జైలు

తెనాలిరూరల్: ఓ వివాహితతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఆమె భర్తపై దాడి చేసి, గాయపరిచిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలేనికి చెందిన వివాహితను అదే ప్రాంతానికి చెందిన కూకట్లపల్లి వెంకట మణికంఠ వేధించేవాడు. గతేడాది జూన్ 1న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. 2 వ తేదీ తెల్లవారుజామున వివాహిత ఇంటికెళ్లి తలుపు తట్టాడు. ఆమె భర్త తలుపు తీయడంతో.. అతనిపై రాయి, ఇనుప రాడ్డుతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కేసు గురువారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాలని ఉత్తర్వులిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జె.ఎలిజిబెత్ రాణి వాదనలు వినిపించారు.

పెదకోనేరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద కోనేరు (కల్యాణ పుష్కరిణి) పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దేవదాయ అధికారులకు, సిబ్బందికి సూచించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న పూడికతీత పనులను ఆర్కే గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వేసవి ఎండ తీవ్రత, వడగాల్పుల ప్రభావం కారణంగా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పెద కోనేరు మరమ్మతులు చేస్తున్నారన్నారు. కోనేరు మరమ్మతుల నిమిత్తం మద్రాసు నుంచి ప్రత్యేక యంత్రాన్ని తెప్పించి పనులు జరిపిస్తున్నట్లు చెప్పారు. ఇన్ని రోజులు శ్రమించినప్పటికీ లోతు భాగాన్ని అంచనా వేయలేకపోతున్నామని తెలిపారు. ఏదిఏమైనా కోనేరు పూడికతీత పనులు తుది దశకు చేరుకున్నాయని, వీలైనంత త్వరలోనే మెట్ల మార్గం, చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.



పెదకోనేరు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

భాగవతుల వారి వీధి విస్తరణ పనులు ప్రారంభిస్తాం..

నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న భాగవతుల వారి వీధి విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తూ చట్టానికి లోబడి ఈ రహదారి విస్తరణ పనులు చేపడతామన్నారు. రాజధాని అభివృద్ధికి తగిన విధంగా మంగళగిరి అభివృద్ధి చెందకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఈనెల 26వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పేదల ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తయిన తరువాత భాగవతుల వారి వీధి విస్తరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ప్రగడ కోటయ్య ప్రాంగణంలో నిర్మాణం జరుగుతున్న డాక్టర్ వైఎస్సార్ చేనేత భవన్‌ను జాతీయ చేనేత దినోత్సవం నాడు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరంలోని తెనాలి రోడ్డు రక్షిత మంచినీటి పథకం వద్ద తుదిదశకు చేరుకున్న స్విమ్మింగ్‌పూల్, స్కేటింగ్ రింక్‌లను మరో 15 రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. స్విమ్మింగ్ పూల్‌కు 1956లో జరిగిన ఒలింపిక్స్ ఈత పోటీల్లో ఐదో స్థానం సాధించిన రేపల్లెకు చెందిన దివంగత షంషేర్‌ఖాన్ పేరు పెట్టనున్నట్లు తెలిపారు. పక్కనే నిర్మితమవుతున్న పవర్ లిఫ్టింగ్ అకాడమీకి ఇటీవల మృతి చెందిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు పేరును నామకరణం చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రష్మిని అభినందించిన ఎమ్మెల్యే

- రూ.10వేల ప్రోత్సాహక నగదు అందజేత
- ఇంజినీరింగ్ చదువుకు హామీ

మంగళగిరి: ఇటీవల విడుదల చేసిన ట్రిపుల్ హయ్యర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానం సాధించిన నగరంలోని జగనన్న కాలనీ (టిడ్కో)కు చెందిన బిత్రా రష్మిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అభినందించారు. గురువారం ఆయన రష్మి నివాసానికి వెళ్లి రూ.10వేల ప్రోత్సాహక నగదును అందజేయడంతోపాటు సత్కరించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ విశేషంగా రాణించి మంగళగిరి పేరును రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో నిలపడం మనందరికీ గర్వకారణమన్నారు. నగరంలోని వీజే కళాశాలలో చదివిన రష్మి ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 857 మార్కులు సాధించి ఎంసెట్ పరీక్ష రాసిందని, అందులో ర్యాంక్ వస్తే ఇంజినీరింగ్ చదువులకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ఎమ్మెల్యే ఆర్కే హామీనిచ్చారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతుల పరిశీలన

నగరంలోని టిడ్కో గృహ సముదాయాన్ని గురువారం ఎమ్మెల్యే ఆర్కే సందర్శించారు. స్థానిక గృహయజమానుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



రష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

చేనేత మగ్గాల షెడ్ల పరిశీలన

నగరంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో సుమారు రూ.2.50 కోట్లతో జరుగుతున్న చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థికసాయం

మంగళగిరి: కొద్దిరోజుల కిందట సీఆర్‌డీఏ పరిధి నిడమర్రు ఆర్-5 జోన్ లేఅవుట్ పనుల్లో ఈదురుగాలులకు రేకుల షెడ్డు కూలి గాయపడిన కార్మికులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థికసాయం అందజేశారు. నగరంలోని ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఐదుగురు క్షతగాత్రులను గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, నగర కమిషనర్ శారదాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావులు పరామర్శించారు. గాయపడిన ఒక్కొక్కరికి రూ.25వేల నుంచి రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠిని కోరారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తాను అందుబాటులో లేకపోవడంతో నేడు బాధితులను కలిసి పరామర్శించడం జరిగిందన్నారు.



బాధితులను పరామర్శించి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

ప్రారంభమైన గంగమ్మ జాతర



తాడిబోయినవారిపాలెంలో నిర్వహిస్తున్న గంగమ్మతల్లి జాతర

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తాడిబోయినవారిపాలెంలో ప్రతి ఐదేళ్లకు సారి జరిగే గంగమ్మతల్లి జాతర గురువారం రెండో రోజుకు చేరుకుంది. వల్లభాపురం వద్ద కృష్ణానదిలో గంగమ్మ తల్లికి స్నానం, బొల్లి ఆవులు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గంగమ్మతల్లి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

డీ అడిక్షన్‌తో సమస్యకు పరిష్కారం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక చిగురు బాలల గ్రామంలో ఏజి చర్చి పాస్టర్ సంఘ సభ్యులకు మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడాలని, అందరం కలసి సామాజిక బాధ్యతతో సమస్యని గుర్తించాలని, విద్యార్థులు, యువత సిగరెట్, గంజాయి మొదలైన మత్తు పదార్థాలకు ఎక్కువగా అలవాటు పడడం గమనిస్తున్నామని అన్నారు. దాంపత్య జీవితంలో ఇబ్బందులు, సెల్‌ఫోన్ అడిక్షన్, ఒంటరితనం, మానసిక ఒత్తిడులు మొదలైన సమస్యలకు, మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి డీ అడిక్షన్ చికిత్స ద్వారా సాధ్యమవుతుందని సైకాలజిస్ట్ జి.అనూష వివరించారు. జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ మత్తుకు బానిసలైన వారికి నూజివీడులోని బోస్కో డీ అడిక్షన్ సెంటర్, విజయవాడ పెజ్జోనిపేటలోని నీ తోడు మానసిక వికాస కేంద్రాల్లో మంచి చికిత్స లభిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఏజీ చర్చి పాస్టర్స్ సంఘం అధ్యక్షులు వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మానసిక ఒత్తిడులతో చాలామంది బాధపడుతున్నారని, మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాన్ని వృథా చేసుకుంటున్నారని, విద్యార్థులను, యువతను రక్షించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, జె.ఆంజనేయులు, ఏజీ చర్చి పాస్టర్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు

దుగ్గిరాలలో వేసవి విజ్ఞాన శిబిరం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహిస్తున్న చదవడం నాకిష్టం కార్యక్రమానికి గురువారం జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. చిన్నారులకు రంగు పేపర్లతో వివిధ రకాల పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, న్యూస్‌పేపర్‌తో టోపీలు తయారు చేయడం, కాగితం ముక్కలను చించి వాటిని దండలాగా తయారు చేయడం నేర్పించారు. వివిధ రకాల పరిమాణాలు కలిగిన తాళ్లను సమానం చేయడం, కర్పూరాన్ని అరచేతిలో మండించడం వంటి వాటి వెనుక ఎటువంటి మ్యాజిక్ కానీ, మంత్రాలు కానీ లేవని వివరించారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని, నమ్మకాలకు, మూఢ నమ్మకాలకు మధ్య తేడాను తెలుసుకుని మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జ్యోతి, బి.లలితానంద ప్రసాద్, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో పేపర్లతో తయారు చేసిన పూలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

నులకపేటలో డోర్ టు డోర్ క్యాంపెయిన్



బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేటలో ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ముస్తఫా మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా 100 శాతం అడ్మిషన్ల నమోదు కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉచితంగా విద్యాబోధన చేస్తున్నామని, ఎంపీయూపీ ఉర్దూ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వాహనాల పంపిణీ

పట్నంబజారు: బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందన్నారు. ఒక్కో మోటారు సైకిల్ రూ. 1.20 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చి యార్డు చైర్మన్ సుధాకర్‌రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ బేగం, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి

కర్రసాము పోటీల్లో కురగల్లు యువకుని ప్రతిభ

మంగళగిరి: తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన నేషనల్ లెవెల్ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో భాగమైన కర్రసాము పోటీల్లో కురగల్లుకు చెందిన యువకుడు ప్రతిభ సాధించినట్లు శిక్షకుడు ఖరీదు సాంబయ్య తెలిపారు. కురగల్లులో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కర్రసాము పోటీల్లో భాగంగా ఒక కర్ర, రెండు కర్రలు, చైన్‌పంత్, సురులు, ఫైటింగ్ విభాగాల్లో కురగల్లుకు చెందిన అడివి తిరుమలరావు ఒక గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. కర్రసాములో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన తిరుమలరావును స్థానికులు సత్కరించారు.



తిరుమలరావును సత్కరిస్తున్న శిక్షకుడు ఖరీదు సాంబయ్య

యువతకు చేరువలో ఎన్‌ఐఎఫ్‌ఎస్

నెహ్రూనగర్: యువతకు విద్యతో పాటు ఉపాధి కల్పనే ధ్యేయంగా ఎన్‌ఐఎఫ్‌ఎస్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ) పని చేస్తోందని సంస్థ అధినేత సునీల్ మహంతి పేర్కొన్నారు. మాయాబజార్‌లోని కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఐఎస్ఎస్ ట్రైనింగ్ సెంటర్‌ను శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంటు ఆఫ్ కార్పొరేషన్ , స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, నాగార్జున యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ అనుబంధంగా వృత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు విద్యతోపాటు ఉపాధి కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి

వలంటీర్‌లను సత్కరించిన కత్తెర సురేష్‌కుమార్

పొన్నెకల్లు(తాడికొండ): వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ, సంక్షేమం అభివృద్ధి సకాలంలో చేరుతుందని, సచివాలయ వ్యవస్థకు బాసటగా నిలుస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం అని వారిని అభినందించడం సంతోషంగా ఉందన్నారు. పొన్నెకల్లు, దామరపల్లి, ఫణిదరం, బండారుపల్లి, గరికపాడు గ్రామాలకు చెందిన పలువురు వలంటీర్లను సత్కరించి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకతోటి మేరిమ్మ, ఎంపీడీవో బెజ్జం మహేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్ల శివనాగరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

4న ఎస్పీ బాలు జయంతి వేడుకలు

పాత గుంటూరు: కళా దర్బార్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 4న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపకులు పాత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ 4న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ఎనిమిది మందికి బాలు జీవిత సాఫల్య పురస్కారాల్ని అందించి సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ బాలు పాటలతో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డి.బి. బాలస్వామి, బి.చంద్రబాబు, బి. రాజశేఖర్, కె. బాబూరావు, చింతా రజని, షేక్ సత్తార్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన రంగారావు, బాలస్వామి తదితరులు

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమా జన్మదినం పురస్కరించుకుని గురువారం నియోజకవర్గంలోని 50వ డివిజన్ మల్లికార్జునపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నగర లీగల్ సెల్ చైర్మన్, న్యాయవాది అమృతలూరి రవికిరణ్ ఆధ్వర్యంలో వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ముస్తఫా కండువాలు కప్పి స్వాగతం పలికారు. మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు సమతుల్యంగా సంక్షేమాన్ని దరి చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రమంటే అక్షరక్రమంలోనే కాకుండా, అభివృద్ధిలో ముందంజలో ఉండేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కచ్చితంగా రానున్న రోజుల్లో సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పరిపాలనను ప్రజల ఇంటి వద్దకు చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నగరాభివృద్ధి జరుగుతోందని చెప్పారు. మిర్చి యార్డు చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు అడపా శేషు, మందపాటి శేషగిరిరావు, ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

వైభవంగా పేరంటాలమ్మ తిరునాళ్ల

దావులూరు(కొల్లిపర): దావులూరులో వేంచేసియున్న బాపమ్మ పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. దేవాలయం 518 ఏళ్ల చరిత్ర కలిగి, విశేష పూజలందుకుంటున్న దేవతగా పేరుగాంచిన తల్లి బాపమ్మ పేరంటాలమ్మ కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. కుటుంబ సభ్యులతో పసుపు, కుంకుమలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అఖండ జ్యోతి, పంచామృతాలతో, రోకళ్లతో పూజ, గుమ్మడికాయ, విగ్రహాల గ్రామోత్సవం, మేకపోతు వంటి వాటితోపాటు ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణతో తిరునాళ్లలో ప్రత్యేక సంతరించుకున్నాయి. రైతులు పశువులను, ట్రాక్టర్లను, పసుపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు బాగుండాలని అమ్మవారిని కోరుకున్నారు.

నాటు సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

నగరం: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. పరిశావారిపాలెంలో నాటుసారా విక్రయిస్తున్న మహిళను గురువారం సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వివరాలు వెల్లడించారు. శిరిపూడి శివారు పరివారిపాలెంలో ఏమినేని వెంకటేశ్వరమ్మ అనే మహిళ నుంచి రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వెంకటేశ్వరమ్మను అరెస్ట్ చేసి, రేపల్లె సబ్ కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా.. నాటుసారా విక్రయాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

ది నూతక్కి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్.

బహిరంగ వేలం ప్రకటన (NPA)

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు మా నూతక్కి సహకార సంఘము నందు పసుపు సరుకును తాకట్టుపెట్టి ఋణములు తీసుకొనియున్నారు. ఎన్ని నోటీసులు పంపినను ఋణములు చెల్లించని కారణంగా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నందున వారి సరుకును ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టం 1964ననుసరించి ఋణమూలముగా బహిరంగ ప్రకటన చేయటమేమనగా, ఈ క్రింది ఖాతాదారుల పసుపు సరుకును ది.02/06/2023న శుక్రవారం సాయంత్రం గం॥ 4.30 ని॥ లకు ఆయా గోడౌనుల ఆవరణముల నందు బహిరంగ వేలము వేసి వారి పేరున ఉన్న బకాయిలకు జమకట్టుకొనబడును.

షరతులు: 1)వేలములో పాల్గొనదలచినవారు సరుకు విలువలో 15% నగదును సంఘము నందు చెల్లించి వేలం తేదిన ము॥ 3 గం॥లలోపు పేరు నమోదు చేసుకొనవలెను. 2)ఎట్టికారణము చూపకనే వేలం ఆఫర్‌ను తిరస్కరించుటకు గాని, ఆపి వేయుటకు గాని, వాయిదా వేయుటకు గానీ సంఘమునకు పూర్తి అధికారములు కలవు. 3) వేలం వేసిన బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. 4) ఈ వేలం ప్రకటన మరియు వసూలు ఖర్చులు ఖాతాదారులే భరించవలెను.

క్ర.సం	ఖాతా సంఖ్య	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బాకీ మొత్తం
1	497/PL	అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి S/o సత్యనారాయణరెడ్డి	రూ.15,48,133/-
2	507/PL	అన్నపురెడ్డి నాగేశ్వరమ్మ W/o శ్రీనివాసరెడ్డి	రూ.15,25,211/-
3	576/PL	జొన్నల వెంకటరెడ్డి S/o పిచ్చిరెడ్డి	రూ. 10,08,974/-
4	577/PL	చీజెపూడి బ్రహ్మారెడ్డి S/o గోపిరెడ్డి	రూ. 13,03,685/-

షర్ నెం. H.213 నూతక్కి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లి॥ నూతక్కి

సం/- సంఘ అధ్యక్షులు బిహెచ్. సుధాకరరెడ్డి, ప్రెసిడెంట్

యూనియన్ బ్యాంక్ Union Bank

మంగళగిరి బ్రాంచి

గౌతంబుద్ధ రోడ్, మంగళగిరి, గుంటూరు జిల్లా.

ఫోన్ : 08645-232354. E-Mail: ubin0803669@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్ ప్రస్తుత యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మంగళగిరి బ్రాంచి అధీకృత అధికారి దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం [illegible] ... "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఏలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన దిగువ [illegible] ... ది.27-06-2023న [illegible] ... రిజర్వుధర మరియు ఇతర వివరములు ఈ దిగువ ఇవ్వబడినవి. రిజర్వుధర కంటే తక్కువకు ఆస్తి అమ్మబడదు.

1) ఋణగ్రహీత(లు)/ సహాఋణదారు(లు)/ తనఖాదారు(లు)/ హామీదారు(లు) : శ్రీ వాస నాగఫణీంద్ర, తండ్రి : వి. పోలురాజు, డి.నెం.5-63, రామాలయం వీధి, బేతపూడి, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503, 2) శ్రీమతి వాస నాగమల్లేశ్వరి, భర్త : వి. పోలురాజు డి.నెం.5-63, రామాలయం వీధి, బేతపూడి, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503, 3) శ్రీ వాస పోలురాజు, తండ్రి : వాస ఆదినారాయణ, డి.నెం.5-63, రామాలయం వీధి, బేతపూడి, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

బకాయి మొత్తం : ది.23-05-2023 నాటికి రూ. 10,72,671/- (అక్షరాల పది లక్షల డెబ్బైరెండు వేల ఆరు వందలడెబ్బై ఒక్క రూపాయలు మాత్రము) మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు.

స్థిరాస్తి వివరములు : తనఖాపెట్టబడిన ఆస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్-522503, గుంటూరు జిల్లా, మంగళగిరి, బేతపూడి, రామాలయం వీధి, డి.నెం.5-63, సర్వే నెం. 321, బేతపూడి గ్రామము లోని డోరు నెం. 5-160/1 నందు శ్రీ వాస నాగఫణీంద్ర, తండ్రి : వి. పోలురాజుకు చెందిన 66 చ.గజాల విస్తీర్ణముగల స్థలముతో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ + 1వ అంతస్తుల గల ఇంటి [illegible] ... దీనికి హద్దులు : తూర్పు : [illegible], పడమర : [illegible], ఉత్తరం : పంచాయతీ బజారు, దక్షిణం : వాస [illegible]

రిజర్వు ధర : రూ. 22,13,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 2,21,300/- | బిడ్ పెంపుదల : రూ. 22,130/-

ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు బ్యాంక్ సంబంధిత లింక్ www.unionbankofindia.com ను దర్శించగలరు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు. [illegible]

ప్రదేశం : మంగళగిరి, తేదీ : 25-05-2023 | సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మంగళగిరి బ్రాంచి, గుంటూరు జిల్లా.